క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్‌తో ప్రజలకు భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకుంటున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం క్యాంపు కార్యాలయంలో అంబాజీపేట మండలం గంగలకుర్రు మండలం మాజీ సర్పంచ్ పులిదిండి ఏడుకొండలు సతీమణి పులిదిండి మంగాదేవికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు సీఎం జగన్ ఆర్థికసాయం అందిస్తూ వారికి మనోధైర్యం కల్పిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలను ఆదుకుంటున్నారని చెప్పారు. కొండేటి వికాస్‌బాబు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

మలికిపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు డిసెంబర్ 15 నుంచి 20 వరకు జరుగుతాయని మలికిపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముత్యం వీరాస్వామి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ క్రీడల పోటీలు జరుగుతాయన్నారు. అందులో గెలిచిన టీం లు మండల పోటీలకు, అక్కడ గెలిచిన వారు నియోజకవర్గ స్థాయికి, అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని అన్నారు. పదిహేనేళ్ల పైబడిన, ఆసక్తి గల విద్యార్థులు వారి గ్రామ పంచాయతీలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా మాస కల్యాణం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి మాస కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి మాస కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- గొందిలో గడప గడపకూ..

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో కూడిన పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం గొందిలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, ప్రజాపాలనకు ప్రజలంతా అండగా నిలిచి రాష్ట్రంలో మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, నాయకులు చింతా రాజబాబు, ఒడుగు వెంకట్, రాపాక సూరయ్య, నడింపల్లి వెంకట సుబ్బరాజు, గెద్దం అమ్ములు పాల్గొన్నారు.



గొందిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

బ్యారేజీపై రోడ్డు నిర్మించి తీరుతాం

ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేపట్టబోతున్నామంటే ముందుగా తెలుసుకుని ఒక నలుగురిని పోగేసి హడావుడి చేసి మేమే మొత్తం చేశామని చెప్పడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారిందని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలోని ఆయన స్వగృహం వద్ద మాట్లాడుతూ బొబ్బర్లంక ధవళేశ్వరం బ్యారేజీ రోడ్డు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. ప్రతిపక్షాలు రోడ్డు నిర్మించాలని అడగడాన్ని కూడా మేము స్వాగతిస్తున్నాం. ఆ రోడ్డు నిర్మాణం కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యం అవుతోందన్నారు. ఈ విషయాన్ని నేనే ముందుండి ఉభయ గోదావరి జిల్లాల్లో 8 మంది ఎమ్మెల్యేలతో సంతకాలు చేయించి సీఎం దృష్టికి తీసుకెళ్లగా గతంలో మంజూరు చేసిన మొత్తానికంటే ఇంకో రూ.40 లక్షలు పెంచి రూ.కోటి 76 లక్షల 40 వేలు మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణానికి సదరు అధికారులు ఈ నెల 16న టెండర్లు కూడా పిలిచారని, టెండర్ల ప్రక్రియ డిసెంబర్ 4తో పూర్తయి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న ప్రతిపక్షాలు రోడ్డు నిర్మాణం కోసం హడావుడి చేస్తే అది వారు పోరాడి తెచ్చినట్టు మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తున్నారన్నారు. గతంలో కొత్తపేట రోడ్డు విషయంలోనూ ఇలానే చేశారు తప్ప ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడటం వీరికి తెలియట్లేదని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశామో ప్రజలే చూశారని, వారే వీరికి సమాధానం చెప్తారని అన్నారు.



ధవళేశ్వరం బ్యారేజీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన ప్రతులు చూపుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

శ్రీకృష్ణ ఆలయానికి భూమి పూజ



ఆలమూరులో శ్రీకృష్ణ ఆలయానికి భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: స్థానిక యర్ర కాలనీ రోడ్డులో యాదవ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయానికి ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి భూమి పూజ చేశారు. వేద పండితుడు కాళ్లకూరి సూరిపండు మంత్రోచ్చారణ మధ్య గంగుల మెహెర్‌ప్రసాద్-శ్రీదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తానని, టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, నామాల శ్రీనివాసు, గంగుల రామ్‌కుమార్, వి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సంధిపూడిలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

క్రికెట్ మ్యాచ్ వీక్షించిన ఎమ్మెల్యే



రావులపాలెంలో క్రికెట్ అభిమానులతో కలసి భారీ స్క్రీన్‌పై ఫైనల్ మ్యాచ్ తిలకిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: భారత్–ఆస్ట్రేలియా వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక ప్రసారాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభిమానులతో స్క్రీన్‌పై తిలకించారు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. స్క్రీన్ వద్ద క్రికెట్ అభిమానులతో కలసి మ్యాచ్ తిలకిస్తూ క్రికెట్ అభిమానులకు జగ్గిరెడ్డి స్వీట్స్ పంపిణీ చేశారు. భారీ స్క్రీన్‌పై క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు.

అంతర్వేది ఆలయ అభివృద్ధికి కృషి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ అభివృద్ధికి మరింతగా తన వంతు కృషి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో నూతన అన్నదాన భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి, అర్చకులు లక్ష్మీనృసింహుని చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తన చేతుల మీదుగా అన్నదాన భవనానికి భూమిపూజ చేయించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేవస్థానం చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీలు పోతాబత్తుల భాస్కరరావు, బైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో నూతన అన్నదాన భవనానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

కవుల ఖ్యాతిని భావితరాలకు తెలపాలి

ఆలమూరు: కవులను, రచయితలను అందించడంలో ఆలమూరుకు ఉన్న స్థానం చరిత్రలో ప్రత్యేకమైనదని దూరదర్శన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రిటైర్డ్) సత్యవోలు సుందరసాయి అన్నారు. తెలుగు సాహిత్యం, ఆధ్యాత్మికం, రాజకీయం, చారిత్రకంగా గ్రామానికి ఉన్న విశిష్టతలను భావితరాలకు అందించే విధంగా నేటి యువత చర్యలు తీసుకోవాలన్నారు. ఆలమూరుకు చెందిన 14 మంది రచయితల కథలతో యువ రచయిత గొడవర్తి శ్రీనివాసు సంకలనం చేసిన ×ఆలమూరోళ్ల కథలు× కథానిక సంపుటి ఆవిష్కరణ ఆదివారం జరిగింది. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ప్రముఖ కవి, శతక కర్త కామవరపు మల్లికార్జునరావు (గౌరీ మల్లిక్) అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ఆలమూరుకు చెందిన కవులతో పాటు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన పురాణపండ రామమూర్తి, రేడియో వ్యాఖ్యాత ఉషశ్రీ వంటి ప్రముఖులతో పాటు పోలాప్రగడ జనార్దనరావు (జెన్ని) వంటి సినీనటులు ఆలమూరుకి చెందిన వారే కావడం తాము అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు నిర్వాహకులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం ఆలమూరోళ్ల కథలు పుస్తకాన్ని సంపాదకులు శ్రీనివాసు స్థానిక గ్రామ దేవత రావులమ్మ వారికి అంకితం చేశారు.



ఆలమూరోళ్ల కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవులు, రచయితలు, ప్రజా ప్రతినిధులు

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: శ్రీనివాస్‌నగర్‌లో వేంచేసిన విజయ భేతాళ స్వామి ఆలయం వద్ద స్థానిక కమిటీ సభ్యులు ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. విజయభేతాళ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబాజీపేట, మాచవరం శ్రీశెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన బాలత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి లక్షపత్రిపూజ వైభవంగా నిర్వహించారు. సర్వేజనా సుఖినో భవంతు ట్రస్ట్ చైర్మన్ అయ్యగారి వ్యాఘ్రేశ్వర సతీష్‌రాజ్, కార్యదర్శి వక్కలంక రాధాకృష్ణలతో పాటు ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. స్వామికి రుద్రహోమం, సూర్యనమస్కారాలు, సుందరకాండ పారాయణ తదితర పూజలను వేదపండితుల నడుమ నిర్వహించారు.

హిందూ ధర్మం.. అందరికీ మార్గదర్శకం

అంబాజీపేట: ప్రపంచ వ్యాప్తంగా అన్ని ధర్మాల్లోకెల్లా హిందూ ధర్మం ఎంతో గొప్పదని అందరూ ఆచరించదగినదని కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్, మహా మహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ అన్నారు. మండలంలోని మాచవరంలో వేంచేసిన అలనాటి త్రేతాయుగంలో శ్రీరామునితో ప్రతిష్ఠించిన పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో సుమారు రూ.40 లక్షలతో మాచవరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పద్మావతి ట్రేడర్స్, పద్మావతి వెంచర్స్ అధినేత మైపాల తాతాజీ, పద్మావతి దంపతులతో నూతనంగా నిర్మించిన గాలి గోపురం, తూర్పు మండపం, ప్రహరి, యాగశాలను వేద మంత్రోచ్చారణల నడుమ ప్రారంభించారు. మైపాల కృష్ణ, మైపాల తాతాజీ దంపతులు చండీ హోమాన్ని, లక్షపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన దెందులూరి సర్వేశ్వర సీతారామ శర్మతో ప్రవచనాలు, కాకినాడకు చెందిన తోట దివాకర్ బృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లేటికుర్తి సత్యనారాయణ మూర్తి, మాచరి సూర్యనారాయణ మూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మాచవరంలో పూజలు చేస్తున్న తాతాజీ దంపతులు

వైభవంగా 108 కలశల పూజ

మామిడికుదురు: అయ్యప్పస్వామి 108 కలశాల పూజ శనివారం రాత్రి అప్పనపల్లిలో వైభవంగా జరిగింది. కామిశెట్టి మణికంఠ స్వామి స్వగృహం వద్ద ఈ పూజ ఆద్యంతం కనులపండువలా జరిపించారు. ముందుగా స్వాములు పేటతుళ్లి ఆడుతూ మేళతాళాలు, బాణసంచా కాల్పులతో కలశాలను గ్రామంలో ఊరేగిస్తూ వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో గోదావరి నదీ జలాలు తీసుకువచ్చి పూజలు చేశారు. పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో వినాయకునికి, సుబ్రహ్మణ్యస్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలు, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామాలతో అర్చన చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాల భజన కార్యక్రమం భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేసింది.



అప్పనపల్లిలో అయ్యప్ప కలశ పూజలో పాల్గొన్న స్వాములు

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

మలికిపురం: ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్లను రాష్ట్ర ఆల్డా చైర్మన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా మలికిపురంలో ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దొరబాబు మాట్లాడుతూ పొగరహిత దేశంగా మార్చాలని ప్రధాని మోదీ పేదలకు ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, కిసాన్ మోర్చా నాయకులు ఇందుకూరి అచ్యుతరామరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడబాల వెంకన్నబాబు, కామాక్షి తాయి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ మండల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ సన్నిధిలో భగవన్నామ సంకీర్తన

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో 3వ అఖండ భగవన్నామ సంకీర్తన రెండో రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈఓ జి.మాధవి తెలిపారు. టీటీడీ జిల్లా ధార్మిక సలహా మండలి సభ్యుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళలు ఈ నెల 25వ తేదీ వరకు నిరంతరాయంగా ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తారు. అఖండ భగవన్నామ సంకీర్తనలో భాగంగా వేంకటేశ్వర గోవిందనామ గానామృతం ఆలపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలతో పాటు పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అప్పనపల్లిలో ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్న మహిళా బృందం

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

అంబాజీపేట: ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ కెన్యూ రియూ కరాటే చాంపియన్ షిప్ పోటీలను రామచంద్రపురంలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో పుల్లేటికుర్రుకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందుకున్నట్లు కోచ్ బి.విఘ్నేశ్వరరావు తెలిపారు. డీటీ సుబ్బారాయుడు, ఆర్‌వీడీ హనుమాన్, ఎస్.మంగన గోల్డ్ మెడల్స్, ఎస్.యజ్ఞశ్రీ, ఆర్.తేజ నరేష్, కేఎస్ఎస్ తరుణ్‌కుమార్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు.

సహకార సంఘాల్లో భాగస్వామ్యానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ బండారు సత్తిరాజు

అయినవిల్లి: మహిళలు, యువత, బలహీన వర్గాల బలోపేతం కోసమే సహకార సంఘాల్లో భాగస్వామ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ బండారు సత్తిరాజు అన్నారు. ఆదివారం అయినవిల్లి మండలం నేదునూరు పీఏసీఎస్ వద్ద 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను చైర్‌పర్సన్ జోగి బాబ్జి ఆధ్వర్యంలో బండారు సత్తిబాబు జెండా ఆవిష్కరించారు. జిల్లా సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తొలుత ప్రతిజ్ఞ చేయించారు. డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ బండారు సత్తిరాజు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న ప్రోత్సాహాలను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ వై.రమేష్, నోడల్ ఆఫీసర్ ఎ.కృష్ణమోహన్, డైరెక్టర్లు గుర్రం నారాయణస్వామి, సీఈఓ గోకరకొండ లక్ష్మణరావు, ఎంపీటీసీలు ఇందుగుల వెంకట్రామయ్య, క్లోపల్లి సుబ్బరాజు, వర్రే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సేవలతో జాతి ఔన్నత్యాన్ని చాటాలి

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ అతిథిగా హాజరయ్యారు. సమాజానికి కాపుగా నిలచిన మన పూర్వీకులను ఆదర్శంగా తీసుకొని కాపు సామాజికవర్గంతో పాటు సమాజానికి తమ ఆర్థిక స్తోమతను బట్టి విద్య, వైద్యం, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ప్రతి గ్రామగ్రామాన సాహసోపేతమైన సేవలు అందించడం జాతి గర్వించదగ్గ విషయమని మరింత విస్తృతంగా సహకార భావంతో దాతృత్వాన్ని, ఔన్నత్యాన్ని కొనసాగించాలని దానికి తమ వంతు సహకారం కూడా ఉంటుందని సురేష్ అన్నారు. ఈ సమారాధనలో మద్దా చంటిబాబు, కాపు నాయకులు నిమ్మకాయల జగయ్య నాయుడు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సరిపెల్ల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

రావులపాలెం: కార్తికమాసం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వన సమారాధనలు విశేషంగా ప్రజలను అలరిస్తున్నాయి. మండలంలోని వెదిరేశ్వరం శివారు కాశీ రాజు గారి తోటలో ఆదివారం సత్తి వారి వన సమారాధనను సంఘ పెద్దలు నిర్వహించారు. సత్తి వారి కుటుంబ సభ్యులు సత్తి సూర్యభాస్కర్‌రెడ్డి (చిన్నబ్బు), సత్తి రామకృష్ణారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి వెంకట సత్యనారాయణ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల డ్యాన్స్ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సత్తి వారి కుటుంబ సభ్యులు అంతా కలిసి వన సమారాధన జరుపుకొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య వన సమారాధన

పి.గన్నవరం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పి.గన్నవరంలో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి, నాయకులు కొల్లా శ్రీను, వంకాయల బాలయ్య, బ్రహ్మానందం, పాబోలు సత్యనారాయణ, శ్రీఘాకోళపు లక్ష్మీపతి, నాగేశ్వరరావు, పల్లపోతు రాంబాబు, సలాది చలమయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్తిక వనసమారాధనలో భోజనాలు చేస్తున్న సత్తి వారి కుటుంబ సభ్యులు

విద్యార్థులకు పలు పోటీల నిర్వహణ

సఖినేటిపల్లి/మామిడికుదురు/అంబాజీపేట/ఆత్రేయపురం/కొత్తపేట: మండలంలోని అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు, మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, చదరంగం పోటీలు నిర్వహించారు. మామిడికుదురు గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు ఏర్పాటు చేశారు. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సచివాలయ మహిళా పోలీసు కె.నాగదుర్గ కార్యక్రమంలో పాల్గొని దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల ప్రాతపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఆత్రేయపురం గ్రంథాలయంలో వారోత్సవాలను లైబ్రేరియన్ తమ్మా నమశ్శివాయ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కొత్తపేటలో గ్రంథాలయ అధికారి కుంచే సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏఎస్సై ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టేందుకు, వారి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మహిళలు తమను తాము రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌లో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.



కొత్తపేట గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఏఎస్సై శశాంక

22న ధ్యానాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: నరేంద్రపురంలో వేంచేసిన ధ్యానాంజనేయ స్వామి వారి ఆలయ చతుర్దశ వార్షిక మహోత్సవం ఈనెల 22న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన, సాయంత్రం గ్రామోత్సవం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

23న సత్యసాయి బాబా జయంతి వేడుకలు

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన షిర్డీ సాయిబాబా వారి ఆలయంలో ఈనెల 23న భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి 98వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. స్వామికి సామూహిక సాయి నారాయణ వ్రతాలు, గ్రామోత్సవం తదితర జరుగుతాయన్నారు. పూజల్లో భక్తులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.